క్లుప్తంగా

గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో మనుబోలమ్మ

మనుబోలు: మనుబోలు గ్రామదేవతలైన మనుబోలమ్మ, నాగార్పమ్మలకు ఆదివారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు ఫణీంద్రశర్మ మంత్రోచ్చారణల మధ్య గ్రామదేవతలకు పంచామృతాభిషేకం చేసి ప్రత్యేకాలంకరణ అనంతరం విశేష పూజలు జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో గ్రామదేవతలను దర్శించుకుని సలి పిండి, పానకాలను అమ్మవారికి నైవేద్యంగా పెట్టి గ్రామంలో వర్షాలు బాగా కురిసి పాడి పంటలతో కళకళలాడాలని మొక్కులు తీర్చుకున్నారు.

శ్రీశ్రీకి ఘన నివాళి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): మహాకవి శ్రీశ్రీకి ప్రజా నాట్యమండలి, డప్పు కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘన నివాళులర్పించారు. నగరంలోని 17వ డివిజన్‌లోని జక్కా వెంకయ్య భవన్‌లో శ్రీశ్రీ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. ప్రజా నాట్యమండలి సీనియర్ నాయకుడు పి.విజయ్‌కుమార్ మాట్లాడుతూ యువత శ్రీశ్రీ రచనలు చదివి నవ సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గండవరపు శేషయ్య, శ్రీనివాసులు, కృష్ణయ్య, వేణు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

యోగాపై అవగాహన కల్పిస్తూ..

- బైక్ ర్యాలీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జరుగుతున్న యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆదివారం పతంజలి యోగా సమితి, యోగా మిత్రమండలి ఆధ్వర్యంలో నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా సెట్నెల్ సీఈఓ నాగేశ్వరావు, డీఎస్‌డీఓ యతిరాజు విచ్చేసి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం నుంచి గాంధీబొమ్మ వరకు సాగింది. కార్యక్రమంలో నజీర్‌బాషా, చంద్రశేఖర్, విజయ్ కుమార్‌రెడ్డి, ముత్యాల రవీంద్ర, పెంచలయ్య, రమణయ్య, కోటేశ్వర్‌రెడ్డి, అనిల్, పద్మ, నీరజ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన కుటుంబాలకు ఉచిత వైద్యసేవలు

నెల్లూరు(అర్బన్): గిరిజన కుటుంబాలకు జయభారత్ ఆస్పత్రిలో 10 పడకల వార్డును ఏర్పాటు చేసి ఉచిత వైద్యసేవలందించడం అభినందనీయమని నగర మేయర్ పొట్లూరు స్రవంతి అన్నారు. సింహపురి సేవా సమితి ఆధ్వర్యంలో నడుస్తున్న నగరంలోని జయభారత్ ఆస్పత్రిలో ఆదివారం గిరిజనులకు ఆరోగ్య గుర్తింపుకార్డులను ఇచ్చే కార్యక్రమాన్ని మేయర్ ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో గిరిజనులకు ఆరోగ్య కార్డులు ఇవ్వడమే కాకుండా ఈనెల 30వ తేదీ వరకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తుండటంపై హర్షం వ్యక్తం చేశారు. గిరిజనులకు సేవ చేయడం గొప్ప విషయమన్నారు. ఆస్పత్రి జనరల్ మేనేజర్ గురుప్రసాద్ మాట్లాడుతూ గిరిజన కాలనీల్లో ప్రతి కుటుంబానికి ఆరోగ్య గుర్తింపు కార్డులను ఇవ్వనున్నామన్నారు. అలాగే ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో గిరిజన మోర్చా రాష్ట్ర నాయకులు శ్రీనివాసులు, ఆడిటింగ్ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, సుధాకర్‌రావు, మోహన్‌రావు, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఆటో స్టాండ్ ప్రారంభం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని మూలాపేటగేట్ సెంటర్‌లో ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో నూతన ఆటో స్టాండ్‌ను ఏర్పాటు చేశారు. సీఐటీయూ రూరల్ కార్యదర్శి పెంచల నరసయ్య, ఆటో కార్మిక సంఘం రూరల్ కార్యదర్శి సుధాకర్‌ల చేతుల మీదుగా దీనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటో కార్మికులు యూనియన్ నిబంధనలు పాటిస్తూ క్రమశిక్షణతో ఉండాలన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ పనిచేస్తుందన్నారు. వచ్చే నెల 1వ తేదీన బుచ్చిలో ఆటో కార్మిక సంఘం జిల్లా మహాసభలు జరుగుతాయన్నారు. ఈనెల 27వ తేదీన రూరల్ 4వ మహాసభల్ని ఎంవీఎస్ కల్యాణ మండపంలో నిర్వహిస్తామన్నారు. సంఘం నూతన కమిటీ గౌరవాధ్యక్షుడిగా అమీర్‌బాషా, అధ్యక్షుడిగా ప్రసాద్, కార్యదర్శిగా సునీల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బాబు, జయప్రకాష్, శ్రీనివాసులు, రాజా, షంషాద్, షబ్బీర్, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ వ్యర్థాలను పూడుస్తూ..



కాగులపాడు వద్ద చేపల గుంతలో వేసిన చికెన్ వ్యర్థాలు



అదే పంథా.. ఆగని దందా

- రాత్రి వేళల్లో యథేచ్ఛగా చికెన్ వ్యర్థాల రవాణా
- ఇతర మండలాలకూ వ్యాప్తి
- పట్టించుకోని పోలీసులు, మత్స్యశాఖ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని పలు ప్రాంతాల్లో చేపల సాగు చేసే గుంతల్లో చికెన్ వ్యర్థాలు ఇష్టారాజ్యంగా వేస్తున్నారు. చికెన్ వ్యర్థాలు చేపల సాగులో వాడకూడదని మత్స్యశాఖ అధికారులు చెబుతున్నా వాటిని మాఫియా పట్టించుకోవడం లేదు. రాత్రుళ్లు యథేచ్ఛగా చికెన్ వ్యర్థాలు తరలిస్తున్నారు. దీనిపై నిఘా ఉంచాల్సిన పోలీసులు తమకెందుకులే అని పట్టించుకోవడం లేదు. ఇప్పటివరకు బుచ్చిరెడ్డిపాళెం, సంగం, కొడవలూరు, విడవలూరు మండలాల్లో చికెన్ వ్యర్థాలు ఎక్కువగా వినియోగిస్తున్నారు. ప్రస్తుతం ఇతర మండలాలైన ఇందుకూరుపేట, ముత్తుకూరు, తోటపల్లిగూడూరు మండలాలకు కూడా వ్యాప్తి చెందుతోంది. బుచ్చిరెడ్డిపాళెంలో దామరమడుగు, కాగులపాడు, జొన్నవాడ బ్రిడ్జి, బుచ్చి టోల్‌గేట్ ప్రాంతాల్లో చికెన్ వ్యర్థాల వాహనాలను అడ్డుకునే అవకాశం ఉంది. కానీ పోలీసులు, మత్స్యశాఖ అధికారులు మామూళ్ల మత్తులో పడి వాహనాలను వదిలేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బుచ్చిరెడ్డిపాళెం మండలం దాటుకుని వెళ్తున్న వాహనాలను సంగం మండలంలో పోలీసులు సీజ్ చేస్తుండటం విశేషం. అయితే ఇటు నుంచి వెళ్లకుండా పోలీసులు నిఘా పెట్టడంలో పూర్తిగా విఫలమయ్యారు. వాహనాలు వివిధ గ్రామాల మీదుగా వెళ్తున్న సమయంలో తీవ్ర దుర్గంధం వస్తోంది. ఈ వాసన పీల్చుకోవడం వల్ల శ్వాసకోశ వ్యాధులకు గురవుతున్నామని ఆయా గ్రామ ప్రజలు అంటున్నారు. వాహనాలను అడ్డుకుంటే దాడి చేసేందుకు కూడా మాఫియా వెనుకాడటం లేదని స్థానికులు వాపోతున్నారు.

యాభై శాతానికిపైగా..

బుచ్చిరెడ్డిపాళెం మండలంలో 1,244 ఎకరాల్లో ఆక్వాసాగు జరుగుతోంది. వీటిలో 702 ఎకరాలు చేపల సాగు చేపట్టేందుకు రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మిగతా 542 ఎకరాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ కాలేదు. 50 శాతంపైగా అంటే దాదాపు 700 ఎకరాలకుపైగా చికెన్ వ్యర్థాలు వేసి చేపలను పెంచుతున్నారు.

సాగునీరు కాలుష్యం

చేపల గుంతల్లో చికెన్ వ్యర్థాలు వేస్తుండటంతో సాగునీరు కలుషితమవుతోంది. చేపలు పట్టే సమయంలో వీటిని సాగునీటి కాలువల్లోకి వదలడం వల్ల సాగునీరు మొత్తం కాలుష్యమై వరి, ఇతర పంటలు పండించే రైతులకు శాపంగా మారింది. ఈ నీరు భూమిలో ఇంకిపోవడం వల్ల ఆక్వాసాగు చేపట్టే సమీప గ్రామాల్లో తాగునీరు కూడా కలుషితమై పలు రోగాలకు దారితీస్తోంది.

పదుల సంఖ్యలో వాహనాలు

రాత్రుళ్లు పదుల సంఖ్యలో చికెన్ వ్యర్థాలు తరలిస్తూ రూ.లక్షలు సంపాదిస్తున్నారు. దీని వెనకాల ఓ పెద్ద మాఫియానే ఉంది. మండలంలో దీనికి సంబంధించి పలువురు ఏజెంట్లు కూడా పని చేస్తున్నారు. వీరు ఆక్వా రైతుల దగ్గరికి వెళ్లి వారికి ఎన్ని డ్రమ్ముల చికెన్ వ్యర్థాలు అవసరమో ముందే ఆర్డర్ తీసుకుంటారు. దాని ప్రకారం వాహనం రైతులు చెప్పిన అడ్రస్‌కు నేరుగా చేరుకుని గుంతల్లో వ్యర్థాలు పోసి వెళ్లిపోతున్నాయి. ఈ తంతు రాత్రి 11, 12 గంటల నుంచి మొదలై వేకువజాము వరకు జరుగుతుంది.

ఎమ్మెల్యే చర్యలు తీసుకోవాలి

కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి గత సంవత్సరం డిసెంబర్‌లోపు చికెన్ వ్యర్థాలు వినియోగిస్తున్న వారికి సమయం ఇచ్చింది. అది దాటిపోయి దాదాపు ఆరు నెలలు కావస్తున్నా వ్యర్థాల రవాణా మాత్రం ఆగడం లేదు. దీనిపై ఎమ్మెల్యే చర్యలు తీసుకునే అవకాశం ఉన్నా ఆ దిశగా ఆలోచన చేయడం లేదు. చికెన్ వ్యర్థాల మాఫియా వెనకాల టీడీపీ నాయకులు ఉండటమే దీనికి కారణంగా కనిపిస్తోంది. ప్రజల ఆరోగ్యం దృష్టిలో ఉంచుకుని చికెన్ వ్యర్థాల రవాణా పూర్తిగా నిర్మూలించాలని మండల ప్రజలు కోరుతున్నారు. పోలీసులు, సంబంధిత అధికారులతో ఈ విషయమై ఎమ్మెల్యే సమీక్ష సమావేశం ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా అధికారులకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేయాల్సిన అవసరముంది. లేకపోతే ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదు.

తాగునీరు అనుకుని పురుగు మందు తాగేసి..

- చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి

వెంకటాచలం: పురుగు మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని ఈదగాలి గ్రామానికి చెందిన పర్వతాల మహాలక్ష్మి(80) శనివారం రాత్రి మృతిచెందినట్లు వెంకటాచలం పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. ఈదగాలి గ్రామానికి చెందిన పర్వతాల సుబ్రహ్మణ్యం ఈనెల 6వ తేదీన తన నివాసంలో మద్యంలో పురుగు మందు కలుపుకుని సగం గ్లాసు తాగాడు. తన తల్లి మహాలక్ష్మి తాగునీరు ఇవ్వాలని కోరగా, పురుగు మందు కలిపి ఉన్న నీటిని ఇవ్వగా ఆమె తాగేసింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే ఇద్దరిని చికిత్స నిమిత్తం నెల్లూరు నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మహాలక్ష్మి మృతిచెందగా, సుబ్రహ్మణ్యాన్ని మెరుగైన చికిత్స నిమిత్తం మరో ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మత్స్యకారుడి మృతి

ముత్తుకూరు(పొదలకూరు): ముత్తుకూరు బీసీ కాలనీకి చెందిన మత్స్యకారుడు తిరుపతిరావు సముద్రం వద్దకు వెళ్లి ఆదివారం ప్రమాదవశాత్తు మృతిచెందాడు. అతను వేటకు వెళ్లినట్టుగా చెప్పుకుంటున్నా కుటుంబసభ్యులు మాత్రం వేటకు వెళ్లలేదంటున్నారు. సముద్రం వద్దకు వెళ్లాడని, ప్రమాదవశాత్తు అలల తాకిడికి మృతి చెందినట్టుగా చెబుతున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

జూదరుల అరెస్ట్

కావలి (జలదంకి): కావలి రూరల్ మండలం చలంచర్ల అటవీ ప్రాంతంలో కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో 12 మంది జూదరులను పట్టుకున్నట్లు కావలి రూరల్ సీఐ జి.రాజేశ్వరరావు, ఎస్సై తిరుమలరెడ్డిలు తెలిపారు.

ఆర్టీసీ బస్టాండ్ల తీరు మారాలి

ముత్తుకూరు(పొదలకూరు): ఆర్టీసీ బస్టాండ్ల తీరు మారాలని, సౌకర్యాలను మెరుగు పరచకుంటే చర్యలు తీసుకుంటామని ఆర్టీసీ రీజనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక బీజేపీ నాయకులతో కలిసి సురేష్‌రెడ్డి ఆదివారం ముత్తుకూరు బస్టాండ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇక్కడ కనీస వసతులు కూడా లేవన్నారు. అత్యధికంగా బస్సులు తిరిగే మార్గమే కాక ముత్తుకూరు నుంచి ఆర్టీసీకి ఆదాయం కూడా వస్తున్నట్టు తెలిపారు. అయితే ఇక్కడ కనీస వసతులు కూడా లేకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రయాణికులు వేచి ఉండేందుకు సరైన కుర్చీలు లేవని, ఉన్నా వాటికి పెయింటింగ్ లేదన్నారు. కంట్రోల్ రూమ్ వద్ద సిబ్బంది ఎవరూ లేకపోవడాన్ని తప్పుపట్టారు. ఆర్టీసీ అధికారులతో వెంటనే సురేష్‌రెడ్డి ఫోన్లో మాట్లాడి ఇక్కడి పరిస్థితులను వివరించారు. మరుగుదొడ్లు దుర్గంధభరితంగా ఉన్నాయని, వెంటనే రిపేర్లు చేయించాల్సిందిగా సూచించారు. బస్‌స్టేషన్ తీరు మారకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్టీసీ చైర్మన్ వెంట నాయకులు రవీందర్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, శివ, ఈశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



ముత్తుకూరు బస్టాండ్‌ను పరిశీలించి నాయకులతో మాట్లాడుతున్న సురేష్‌రెడ్డి

మనుబోలులో ట్రాఫికర్



ఆటోలతో మూసుకుపోయిన రోడ్డు

మనుబోలు: మండల కేంద్రమైన మనుబోలులో ఆటోలు స్వైర విహారం చేస్తున్నాయి. ఆటోల రద్దీ మూలంగా వైఎస్సార్ సర్కిల్ వద్ద తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఆర్టీసీ బస్సులు తక్కువగా ఉండడం, ఉన్న బస్సులు సైతం సమయపాలన పాటించకపోవడంతో ప్రతి చిన్న పనికీ ప్రయాణికులు ఆటోలపైనే ఆధారపడాల్సి వస్తోంది. మనుబోలు నుంచి మండలంలోని చెర్లోపల్లి, పిడూరు, యాచవరం, బండేపల్లి, మడమనూరు, వీరంపల్లి, అక్కంపేట తదితర గ్రామాలకు బస్సు సౌకర్యం సరిగా లేకపోవడంతో ఈగ్రామాలకు వెళ్లాలంటే ఆటోలే దిక్కు. దీనికితోడు నెల్లూరు–గూడూరు మధ్య తిరిగే బస్సులు ఎక్కువగా బైపాస్‌రోడ్డున వెళ్తుండడంతో ఆటోలే ఆధారంగా మారింది. ప్రస్తుతం మనుబోలులో 50కుపైగా ఆటోలు ఉన్నాయి. ఆటోల రద్దీకి తోడు కోదండరామపురంలో ఉన్న పలు దుకాణాలు కూడా రోడ్డుపైకి ఉండడంతో ఈ మార్గం ఇరుకుగా మారి తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు వాపోతున్నారు.

క్రికెట్ టోర్నీ విజేత కొమ్మలపూడి



విజేతలతో నిర్వాహకులు

మనుబోలు : మండలంలోని జట్లకొండూరు గ్రామంలో జరిగిన ఎన్ఎస్సార్ మండల స్థాయి క్రికెట్ టోర్నీలో కొమ్మలపూడి జట్టు విజేతగా నిలిచింది. ఈ క్రమంలో విజేతకు ఎన్ఎస్సార్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి సౌజన్యంతో రూ.10 వేల నగదు, ట్రోఫీని నిర్వాహకులు ఆదివారం అందజేశారు. అలాగే రన్నరప్‌గా నిలిచిన జట్లకొండూరు జట్టుకు గ్రామ ఉప సర్పంచ్ ఆవుల తులసీరాం యాదవ్ రూ.7 వేల నగదు, ట్రోఫీని అందించారు.

ఈ సందర్భంగా ఎన్ఎస్సార్ ప్రతినిధి అంబటి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో యువత, విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండేందుకు ఇలాంటి ఆటల పోటీలు ఉపకరిస్తాయన్నారు. యువతలో నాయకత్వ లక్షణాలు, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించడం ద్వారా వ్యక్తిత్వ వికాస నిర్మాణానికి క్రీడలు దోహదపడుతాయన్నారు.

అయ్యగారప్పస్వామి ఉత్సవాలు ప్రారంభం



విద్యుద్దీపాలంకరణలో అయ్యగారప్పస్వామి దేవస్థానం

పొదలకూరు: మండలంలోని అయ్యగారిపాళెం గ్రామంలో ఏటా నిర్వహించే అయ్యగారప్పస్వామి ఉత్సవాలను ఆదివారం నుంచి ప్రారంభించారు. మూడు రోజుల పాటు ఉత్సవాలను గ్రామస్తులు వైభవంగా నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు గ్రామస్తుల బంధులు, స్నేహితులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతారని గ్రామపెద్దలు వెల్లడించారు. తొలిరోజున స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బాలల సంరక్షణే లక్ష్యం



బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయిస్తున్న పోలీసులు

తోటపల్లిగూడూరు: మహిళలు, బాలబాలికల సంరక్షణే పోలీస్‌శాఖ లక్ష్యమని యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఏఎస్సై శ్రీహరి తెలిపారు. మానవ అక్రమ రవాణా, పోక్సో యాక్ట్, మాదక ద్రవ్యాల దుర్వినియోగం, శక్తి యాప్‌లపై అవగాహన కార్యక్రమాన్ని మండలంలోని నరుకూరు కాలువకట్ట గిరిజన కాలనీలో ఆదివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్సై శ్రీహరి మాట్లాడుతూ బాలబాలికలతో వెట్టిచాకిరీ చేయించడం చట్టరీత్యా నేరమన్నారు. అలాగే బాల్యవివాహాలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవన్నారు. బాలకల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం బాల్యవివాహాలకు వ్యతిరేకంగా కాలనీ వాసులతో ప్రతిజ్ఞ చేయించారు. ఏఎస్సై సతీష్, సిబ్బంది రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యా వలంటీర్లను నియమించాలి

నెల్లూరు(టౌన్): మున్సిపల్ పాఠశాలల్లో తక్షణమే విద్యా వలంటీర్లను నియమించాలని ఆర్టీఏ అధ్యక్షుడు ఖాజామొహిద్దీన్, కార్యదర్శి కిరణ్‌కుమార్ తెలిపారు. స్థానిక వీఆర్ హైస్కూల్లో మంత్రి నారాయణను ఆదివారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్జీటీలకు పదోన్నతులు ఇవ్వడం ద్వారా మోడల్, బేసిక్, ఫౌండేషన్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఏర్పడిందన్నారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని వెంటనే విద్యా వలంటీర్లను నియమించాలన్నారు.

రాజకీయాలపై అవగాహన అవసరం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ప్రతిఒక్కరికీ రాజకీయాలపై అవగాహన ఎంతో అవసరమని మాజీ ఎమ్మెల్సీ వి.బాలసుబ్రహ్మణ్యం, ఆవాజ్ జిల్లా కార్యదర్శి రషీద్ అన్నారు. నగరంలోని ఎంవీఎస్ కల్యాణ మండపంలో ఆదివారం ఆవాజ్ జిల్లా రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు.

కమనీయం.. శ్రీనివాసుని కల్యాణం



పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో ఉన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం శ్రవణా నక్షత్రం సందర్భంగా స్వామివారి కల్యాణం కమనీయంగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామి అమ్మవార్ల కల్యాణం వైభవంగా నిర్వహించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనగా వారికి ముత్యాల తలంబ్రాలను అందజేశారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలను అందించారు.

కోడూరు బీచ్‌లో పర్యాటకుల సందడి



కోడూరు బీచ్‌లో సందడి చేస్తున్న పర్యాటకులు

తోటపల్లిగూడూరు: జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన కోడూరు బీచ్‌లో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. వేసవి సెలవులు పూర్తి కావడంతో విద్యార్థులు చివరిగా బీచ్ సందర్శనకు విచ్చేసి ఉల్లాసంగా గడిపి సెలవులకు స్వస్తి చెప్పారు. జిల్లా నలువైపుల నుంచి తరలివచ్చిన సందర్శకులతో సాగరతీరం కోలాహలంగా మారింది. పిల్లలు, యువత గంటల కొద్ది సముద్రంలో మునుగుతూ ఆనందంగా గడిపారు. కుటుంబ సమేతంగా విచ్చేసిన సందర్శకులు తీరంలో సేదతీరారు.

ఉదయం 10 గంటలకు ప్రారంభమైన సందర్శకుల రాకపోకలు సాయంత్రం 4 గంటల వరకు కొనసాగాయి.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు డ్రైవర్లకు గాయాలు

మనుబోలు: మండల పరిధిలోని జాతీయ రహదారిపై జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు డ్రైవర్లకు గాయాలయ్యాయి. కొండూరుసత్రం వద్ద శనివారం అర్ధరాత్రి తరువాత తిరుపతి నుంచి హైదరాబాద్ వెళ్తున్న ట్రావెల్స్ బస్సు కొండూరు సత్రం వద్ద అదుపుతప్పి బొలెరో వాహనాన్ని ఢీకొని ఆపై ఆగి ఉన్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో మనుబోలు మండలం కట్టువపల్లి గ్రామానికి చెందిన బస్సు డ్రైవర్ సునీల్, సహాయ డ్రైవర్‌తో పాటు బొలెరో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అలాగే ఆదివారం విజయవాడ నుంచి చెన్నై వెళ్తున్న లారీ కృష్ణపట్నం పోర్టు వద్ద ముందు వెళ్తున్న మరో లారీని ఢీకొంది. దీంతో వెనుక లారీ డ్రైవర్‌కు గాయలయ్యాయి. ఇతన్ని కూడా 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. పోలీసులు రెండు ప్రమాదాలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



లారీని వెనుక నుంచి ఢీకొన్న ట్రావెల్స్ బస్సు



లారీ డ్రైవర్‌ను అంబులెన్స్‌లో తరలిస్తూ..



ప్రమాదంలో దెబ్బతిన్న లారీ క్యాబిన్